# గోదారమ్మ-21

నా సంఘర్షణ కి ఆజ్యం పోస్తూ, ఇంతలోనే, ఇంకొక సంఘటన జరిగింది....

ఒకరోజు.... దూరంగా ఉన్న మా ఊరు నుండి కొంతమంది బంధువులు ఆ వూళ్ళోని ప్రసిద్ధిచెందిన గుడిని చూడటానికి వచ్చారు. అమ్మా నాన్నలు చనిపోవటంతోనే మా ఊరికి నా రాకపోకలు, సంబంధాలూ ముగిసిపోయాయి. కానీ వాళ్ళు నా అడ్రసుని ఎలాగో సంపాదించి, యాత్రలో భాగంగా అక్కడికీ వచ్చామని చెప్పినపుడు నాకు చాలా సంతోషంగా అనిపించింది! గుడీ అదీ చూసాక, భోజనానికి మా ఇంటికే వచ్చెయ్యమని చెప్పాను. ఆ తరవాత వాళ్ళని ఆ రోజుకి మా ఇంట్లోనే ఉండమనీ చెప్పాలనుకున్నాను.

నేను కోడలితో ఏవైనా ప్రత్యేకమైన వంటకాలు చేయించమని చెబితే, ఎందుకని ఆరా తీసింది. బంధువులని భోజనానికి రమ్మనమని చెప్పాననే విషయం చెప్పా.

దానికి నా కోడలు నవ్వింది..''నేనూ వాళ్ళకి చెప్పాను, గుడి చూసాక అటునుండి అటే వెళ్ళిపోవటం బావుంటుందని కూడా సలహా ఇచ్చా. భోజనం కోసం మళ్ళీ వెనక్కి రావటం.. ఇదంతా దండుగ పని, ఆపైన ప్రయాస కూడా కదా...!'' అంది కోడలు.

''ఇందులో అంత ప్రయాస ఏముందీ... వాళ్ళు చూడాలనుకుంటున్న దేవాలయం ఇక్కడకు బాగా దగ్గిరేగా...?'' అన్నాను.

''దగ్గిరయితే మాత్రం... నలుగురికి వంట చేయించటం, వడ్డించటం... నాకు ప్రయాస కాదా ? ఎందుకీ లేనిపోని ఆయాసాలు ? పిలవకుండా వచ్చినపుడు, బయటెక్కడో తినేసి వెళ్ళిపోవాలనే అలా చెప్పాను. లేకపోతే ప్రతీవాళ్ళూ వచ్చి తినిపోవటానికి ఇదేమైనా సత్రమా....?'' వెటకారంగా అని ''అయినా మీ పిలుపు మీద, వాళ్ళు రావచ్చేమోనని నమ్మకం మీకు ఇంకా ఉందేమో... చూద్దాంగా, వాళ్ళు మీ మాటకి ఎక్కువ విలువ ఇస్తారో లేక నామాటకే కట్టుబడతారో...!'' అంది సవాలు చేస్తున్నట్లుగా.

నేనేం మాట్లాడలేదు... 'ఓ నలుగురిని ఓపూట భోజనానికి నేను పిలవకూడదా....? ఆ మాత్రం స్వేచ్ఛ, అధికారం కూడా నాకు లేవా....?'

నేను అనుకున్నట్టే వాళ్ళు రాలేదు. రావద్దన్నట్లుగా కోడలు చెప్పాక, 'ఇక రారులే' అని నేనూ అనుకున్న విషయమే! వాళ్ళకి మాత్రం అభిమానం ఉండదా...!

దానికి కోడలు ఏం అర్థం చెప్పిందో తెలుసునా...!

‘‘వాళ్ళు రాలేదంటే... విషయం ఏమిటో మీకు అర్థమైందా...? ఈ ఇంట్లో.... నాదే అధికారమనీ, మీదేం పెత్తనం లేదని తెలుసుకోగలిగారన్న మాట! అయినా ముసలీ ముతకా లాంటివాళ్ళూ రావటం నాకు సుతరామా ఇష్టంలేదు! మన హోదాకి తగ్గవాళ్ళే రావాలి గానీ...!’’ అంది ఖచ్చితంగా చెప్పినట్లుగా.

‘నా వయసువాళ్ళు రాకూడదా? ఇపుడు వయసులో ఉన్నవాళ్ళు ఒకనాటికి ముసలివాళ్ళుకాకపోతారా...! ఇదేం విడ్డూరం...?!’ నేను కళ్ళు పెద్దవి చేసుకుని విచిత్రంగా చూశా. ‘అంటే.... నేను కూడా పెద్దదానినేగా...? నేను కూడా ఆ ఇంట్లో ఉండటం కోడలుకి ఇష్టం లేదా...ఆ రకంగా అప్పటివరకూ ఊహించలేకపోయానా !? మామూలుగా తన అభిప్రాయం చెప్పిందా లేక తనేం మాట్లాడినా నాకదే అర్థం వినిపిస్తోందా... నన్నా ఇంట్లోంచి పొమ్మనాలని పొగబెడుతోందా...?’

ఇంకోసారి నాకు విపులంగా అర్థమయ్యేలా విడమరిచి చెప్పింది కూడా.. “ఈ వయసులో మీ వల్ల ఏమీ కాదు... ఏదో చేసెయ్యగలనని ఆరాటపడకండి. ఏదో పెట్టింది ఇంత తిని, క్రిష్ణా రామా జపంతో కాలక్షేపం చేస్తూ, ఓ మూల కూర్చోవటమే మీ పని. అయినా మీ అబ్బాయి సాధించిన ఘనత వలన మీకింత బాగా రోజులు నడుస్తున్నాయని తెలుసుకుని ఆనందించండి...’’ అంటూ ఏదో సందర్భంలో హెచ్చరికగా చెప్పేసింది!

దాంతో నాలో మథనం మొదలైంది...! ‘నేనేం చేయలేనా... కోడలు చెప్పినట్లుగా ఓ మూల కూర్చోవలసిందేనా....?’

‘ కాదు...కాదు...’ అని నా అంతరాత్మ చెప్పింది. ‘శారీరకంగా నాకే సమస్యలూ లేవు....మరెందుకింత బలహీనురాలినయ్యాను ? పిల్లల మీద ఎందుకు ఆధారపడాలి? నేనూ ఏదైనా చేయగలగాలి! ఇది ఎవరికో కాదు.. నాకు నేనే నిరూపించుకోవాలి!’ ఇదే నా మనసు చేసిన హెచ్చరిక!

‘నా ఆలోచనలు ఎవరికీ చెప్పుకోలేను... కానీ ఆచరణలో పెట్టాల్సిందే అని తీర్మానించుకున్నాను. ఎవరి ఆదిపత్యాన్ని అయినా అంగీకరించటానికి గానీ, వాళ్ళ తెలివితేటలను ప్రశంసించటానికి గానీ నాకేం అభ్యంతరం ఉండదు! అంగీకారమే! అయితే... వాళ్ళు తమంతట తాముగా నన్ను చిన్నచూపు చూసి, చులకన చేస్తుంటే మాత్రం తట్టుకోలేను! భరించలేని విషయంగా ఉంది!’

ఇది కోడలు వల్ల నా గురించి నేను తెలుసుకున్న విషయం!

అప్పటినుండీ నేను కొంచెంగా సర్దుకోవటం మొదలుపెట్టాను. డబ్బు పెట్టిన బ్యాగులోనే కొన్ని బట్టల్నీ పెట్టుకున్నాను. ఒకరోజు అబ్బాయి, కోడలు ఎవరింటికో ఏదో ఫంక్షనుకని వెళ్ళిన రోజునే బయలుదేరాను. ‘నా గురించి వెతకవద్దనీ...స్వేచ్ఛగా బ్రతుకుదామనే కోరికతో నచ్చిన ప్రదేశానికి వెళ్ళిపోతున్నాన’నీ ఉత్తరం రాసి పెట్టి, బయటకి వచ్చేసాను. మా ఇంటికి దగ్గర్లోనే బస్ స్టాండు ఉందని తెలుసు, పనివాళ్ళంతా పనిలో ఉన్నపుడు మునిమాపు చీకటిలో బ్యాగులతో బయటకు వచ్చాను.

మా ఊరువైపు వెళ్ళే బస్సు ఎక్కి కూర్చున్నాను. అప్రయత్నంగా మనసులో పరంధామయ్య గారి గురించిన ఆలోచనలు వచ్చి చేరాయి.. 'ఆయన డబ్బుతో ఆ రోజు ఎందుకు మాయమయ్యారో, తర్వాత ఇన్నాళ్ళకు వాళ్ళ అబ్బాయి వచ్చి డబ్బు అంతా తిరిగి ఇవ్వటమేమిటీ, ఆయన ఏమయ్యారు ?' ... ఇలాంటి ఆలోచనలతో నిద్రలో ఉండగానే, తెల్లవారు ఝామున కండక్టరు బస్సు ఆగిన ఒక వూరు పేరు పెద్దగా అరిచి చెప్పాడు.

వెంటనే మా దగ్గిర పనిచేసిన పరంధామయ్య గారి వూరు అదేనని నాకు గుర్తు వచ్చింది. 'అన్నాళ్ళూ అంత నమ్మకంగా ఇంట్లో మనిషిలా తిరిగిన అతను ఎందుకలాంటి పనిచేశాడో.. దాని పర్యవసానం ఎంత ఘోరంగా మారిందో చెప్పి నిలదీయాలనే' ఆలోచన కలగటంతో వెంటనే బస్సు దిగిపోవటానికి సిద్ధపడ్డాను.

నేను దిగుతోంటే... కండక్టరు ''మీరు వెళ్ళాలని చెప్పిన వూరు ఇది కాదమ్మా...!'' అని హెచ్చరించాడు.

''ఇక్కడా పని ఉంది. అది చూసుకుని తర్వాత వెళ్తానని'' చెప్పి ఈ వూరిలో దిగేసాను..

గోదావరిని చూసాక చాలా ఆహ్లాదంగా అనిపించింది! పరధామయ్య గారి గురించి మీ ఇంటి ముందున్న నలుగురినీ వాకబు చేద్దామని నడుస్తూంటే... నీ శ్రావ్యమైన గొంతు నన్ను కట్టిపడేసింది. అలా మీ ఇంటికి వచ్చాను. మొదట కొన్నాళ్ళు ఉందామనే అనుకున్నాను. కానీ నువ్వు, నీ తీరు నచ్చి నీ ఇంట్లోనే ఉండటం నాకూ బాగా అనిపించింది!

నేను కోల్పోయిన స్వేచ్ఛను ఇక్కడే పొందగలిగాను... నేను కోరుకున్న జీవితం ఇది....!

అవును... నలుగురితో కలిసి వుంటూ ఆ నలుగురికోసం ఏదైనా చేయగలగాలని అనుకున్నాను. నా భావాలకు తగ్గ ఇల్లే నాకు తారసపడింది. నిన్ను చూసినప్పుడల్లా నన్ను నేనే చూసుకున్నట్టు అనిపిస్తూండేది. మీ ఇంటి ముందున్న నలుగురూ, నీకే విధంగా బంధువులూ చుట్టాలూ కారనీ, కేవలం కాఫీ కోసమే వస్తూంటారని తెలిసి ఆశ్చర్యపోయాను. అలా నిస్వార్థమైన నీ సేవ, ప్రేమతత్త్వం నన్ను కట్టిపడేసాయి. నేనెవరో తెలియకపోయినా, నువ్వూ...ఈ ఊరూ, నన్ను ఆదరించిన తీరుకి ముగ్ధురాలినయ్యాను. అప్పుడు నీకూ, ఈ వూరికీ ఏదైనా చెయ్యాలని అనుకున్నాను. ఏ తోడూ లేకుండా నీ జీవితం నిస్సారంగా వుండటం నేను చూడలేకపోయాను. కానీ చిత్రంగా నీతోనూ , ఈ వూరితోనూ నాకు ఏదో పూర్వజన్మ బంధంలా ఒక మానసికమైన అనుబంధం పెనవేసుకుపోయింది, తెలియకుండానే. నిన్నూ, రంగానీ నా స్వంత మనుషుల్లానే భావించాను. అంతే కాదు సీతా... ఒక్కసారి కూడా మా వూరు కానీ, మా వాళ్ళు కానీ గుర్తుకు రాలేదు, నీ సమక్షంలో.

ఆ తరువాత ఈ వూరుపై కూడా అభిమానం పెరిగి, ఇదే నా ఊరు అనుకుంటే సరిపోతుంది గదా అని సరిపెట్టుకోగలిగాను. అలాగే ఈ వూరు వాళ్ళ సమస్యలు నావి అనుకుని ఏదైనా చేయాలనుకుని చేస్తున్నాను. అయినా, నిజానికి నేను చేసిందేమీ లేదు కూడా, కానీ మీరందరూ నన్ను అభిమానిస్తూ...ఈ పనులన్నింటికీ నన్నే కర్తను చేస్తున్నారు కానీ, నేను చేస్తున్నది తక్కువ. మీ అందరి సహాయ సహకారాలూ.. వెల కట్టలేనివి. అయినా

నేను నా జీవితం ఎలా వుండాలనుకున్నానో...అది ఆ ఇంటి నుండి బయటపడటం వల్లనే సాధ్యం చేసుకోగలిగాను. ఇందులో సందేహం ఏమీ లేదు. నేనూ, నా అనుభవాలూ, ఆలోచనలూ ఈ వూరందరికీ ఉపయోగపడేలా ఏవైనా పనులు చెయ్యాలని అనుకున్నాను... మీ అందరి ఆదరణ వలనే, అది చాలావరకూ నిజమైందనే నా భావన...''

ఆవిడ మాట్లాడటం ఆపేసినా...సీత చాలా సేపు మత్తులో వున్నట్టుగా, ఏమీ మాట్లాడలేనిదానిలా ఒక విధమైన అచేతన స్థితి లో ఉండిపోయింది. కొద్దిసేపటికి మెల్లగా తేరుకుని సంభ్రమంగా అంది.." అమ్మా...నిజంగా ఈ రోజుకి మీ గురించి తెలుసుకోగలిగినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. మొదటి నుంచీ...మీ మాట తీరు, ఆహార్యం, వేష భాషలూ...అన్నీ మీరు గొప్పగా బ్రతికిన వాళ్ళని నాకు తెలియజేస్తూనే వున్నాయి. కానీ మీరింత సాధారణమైన జీవితానికి ఏ మాత్రం ఇబ్బంది పడకుండా చక్కగా మాలో కలిసిపోయారు. నిజంగా మీ పరిచయం..నేను, ఈ వూరు చేసుకున్న పూర్వజన్మ సుకృతం అమ్మా...!

మొదటనుంచీ..మీ వాక్పటిమ, నాయకత్వ లక్షణాలూ చూస్తూనే వున్నాను కదా...మీరు ఎవరికైనా ఏ విషయానైనా ఎంతో విపులంగా విశదీకరించి చెప్పగలరూ...వాళ్ళని ఒప్పించగలరూ కూడా. మీ రాక నాలో నిజంగా నూతనోత్సాహాన్ని కలగజేసింది. అంతకు ముందు యాంత్రికంగా స్తబ్దుగా ఉన్న నా జీవితం మీ రాకతో ఉత్సాహంగా పరుగులు తీయటం మొదలుపెట్టింది. నిజం అమ్మా...రామచంద్ర కూడా ఎప్పుడూ మీ గురించి ఇదే అంటూంటాడు....నన్ను దూరం నుంచి మూగగా ఆరాధించటమే తప్ప, ఎప్పుడూ నాతో మాట్లాడగలనని అనుకోలేదంట. మీరే తనని నన్ను కలిసేలా చేసారనీ, పదే పదే మీలో తన అమ్మను చూసుకుంటున్నాననీ చెపుతూంటాడు. అందుకే నేను మిమ్మల్నీ పెద్దమ్మా అని పిలుస్తూన్నా, తనూ మిమ్మల్ని అమ్మా అనే పిలుస్తాడు.

కానీ ఈ రోజు తెలిసింది..మేమెంత పుణ్యం చేసుకున్నామో కదా...మీరు మా వూరు రావటమే కాదు...సరిగ్గా ఆ సమయంలో నా పాట మిమ్మల్ని ఆకర్షించటం...మీరు ఈ చిన్న ఇంట్లో వుండటానికి ఇష్టంగా అంగీకరించటం...ఈ వూర్లో ఎన్నో కార్యక్రమాలు చేపట్టటం...వాటన్నింటిలో మేమూ భాగస్వామ్యం కాగలటం....నిజంగా మా అదృష్టం అమ్మా..!

మీ జీవిత ప్రయాణంలో అన్ని ఒడిదుడుకులనూ మీరు తట్టుకున్న తీరూ...అత్తతో మీకున్న అనుబంధం...కోడలు ఎంత పెడసరంగా వున్నా, ఆమెను పల్లెత్తు మాట అనని మీ స్వభావం, ముఖ్యంగా డబ్బును మీరు సద్వినియోగం చేయాలనుకున్న పద్ధతీ, కేవలం డబ్బు ఇచ్చేసి చేతులు దులిపేసుకోకుండా ప్రతి పనిలోనూ మీరూ లీనమవుతూ, శ్రమదానం చేసే వైనం...మీ జీవిత గాథ అందరికీ స్ఫూర్తిదాయకం అమ్మా ! నేనే కాదు...ఈ వూరు మొత్తం మీకు చాలా ఋణపడి వుంది. ఈ వూరివాళ్ళకి డబ్బూ, పరపతీ, శ్రమ పడే తత్వమూ...అన్నీ వున్నా, 'మనం చెయ్యగలం' అని భుజం తట్టి నడిపించే మనిషి లేడు, ఇప్పటిదాకా. మీ రాకతో ఆ లోటు తీరిపోయింది. మీలాంటి మనిషిని దూరం చేసుకున్న మీ కుటుంబ సభ్యులది నిజమైన దురదృష్టం...ఇంతకన్నా నేనేం చెప్పలేను. మా

అదృష్టం కొద్దీ మీ కోడలికి అలాంటి బుద్ధి పుట్టిందనుకుంటా ! ఏమైనా అమ్మా...యాదృచ్ఛికంగా అయినా మీరు ఈ వూర్లో దిగటం ఈ వూరుకి దక్కిన పుణ్యం..." అంటూనే సీత హఠాత్తుగా గుర్తుకు వచ్చినట్లు...

''అవునమ్మా... నాదో సందేహం. ఇంతకీ మీ డబ్బు తీసుకుని పరారైన వ్యక్తిది ఈ వూరేనని గుర్తుకువచ్చి ఇక్కడే బస్సు దిగేసానని చెప్పారుగా... ఆ మనిషి జాడ కనుక్కున్నారా? ఆ విషయం ఏమైంది? అది... చెప్పలేదూ...?'' అనడిగింది.

గోదారమ్మ నిట్టూర్చింది.

'అతనెవరో కనుక్కున్నాను సీతా... కాకపోతే అతను అప్పటికే ఈ లోకం నుండి వెళ్ళిపోయాడని అతని కొడుకు ద్వారానే తెలుసుకున్నాను!''

ఆ మాటలకు సీత చాలా ఉద్విగ్నంగా ''నిజమా... ఆ చనిపోయిన వ్యక్తి ఎవరూ...? అతని కొడుకు ఎవరూ...?'' అనడిగింది.

ఆవిడ మళ్ళీ నిట్టూర్చి ''నీకూ తెలుసు సీతా...!'' అంది నిర్లిప్తంగా.

సీత ఆశ్చర్యపోతూ ''నాకూ తెలిసిన వ్యక్తేనా... ఎవరు... ఎవరమ్మా....?'' ఆత్రుతగా అడిగింది.

గోదారమ్మ నిర్లిప్తంగా నిట్టూర్చి ''ఈ ఇంట్లో మనతో ఉంటున్న వాడేనమ్మా....!'' అంది.

సీత ఒక క్షణం ఆలోచనలో మునిగి విచిత్రంగా ఆవిడవైపు చూసి ''అంటే....'' అంటూ ఆగిపోయింది.

గోదారమ్మ మెల్లగా ''నీ ఆలోచన సరైనదే... అతను రామచంద్రే...!'' అంది.

సీత కు ఒక్కసారి ప్రపంచం అంతా గిర్రున తిరిగినట్లైంది...వెంటనే ఆవిడను పట్టుకుని వూపేసింది.

''ఏమిటమ్మా ఇది...! మీ డబ్బు పట్టుకుని పారిపోయి వచ్చి... మీ వ్యాపారానికి ఎంతో నష్టం కలిగించటమే కాకుండా, మీవారి మరణానికీ కారణమైన వ్యక్తి కొడుకునే నాకు భర్తగా ఎన్నిక చేసారా....? ఎందుకు....? ఎందుకు మీకలా చేయాలనిపించిందీ....? తల్లిదండ్రుల ఆస్తిపాస్తులకే కాదు... వాళ్ళు చేసిన పాపపుణ్యాలకీ పిల్లలకు వారసత్వపు హక్కు ఉంటుంది కదమ్మా...! నాకు చాలా సిగ్గుగా, బాధగా ఉందమ్మా... అలాంటి వ్యక్తితో నేను జీవితాన్ని పంచుకుంటున్నందుకు. మీరు నామమాత్రంగా నైనా ఈ విషయం నాకు చెప్పలేదేందుకనీ ? ఇంత పెద్ద విషయం నాకు చెప్పాలనిపించలేదా ? అసలు మీరు రామచంద్రను ఎలా క్షమించగలిగారు? అసలు ఈ విషయం మీకెప్పుడు తెలిసిందీ ? రామచంద్రకు ఈ విషయం తెలుసా..? తెలిస్తే, తను చూచాయగా కూడా ఈ విషయం నాతో ప్రస్తావించలేదే. '' అంటూ సీత ఇక ఆ పైన మాట్లాడలేక ఆపేసింది.

సీత కంఠంలో ఆవేదన సుళ్ళు తిరిగింది. సిగ్గుతో...అవమాన భారంతో, అప్రయత్నంగా ఆమె తల వంగిపోయింది.